## క్లుప్తంగా

### హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకురావడం సరికాదు



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**ప్యాపిలి:** అపార్ ఐడీ జనరేట్ విషయంలో హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు రమేశ్ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరే సమయంలో ఇచ్చిన ఆధార్ కార్డులను చాలా మంది ప్రస్తుతం అప్‌డేట్ చేసుకున్నట్లు తెలిపారు. దీంతో అపార్ ఐడీ జనరేషన్ విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆధార్ కార్డులో ఉన్న వివరాల ప్రకారం పాఠశాల రికార్డులో నమోదు చేసేందుకు సమయం పడుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిగణలోకి తీసుకోకుండా హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. యూటీఎఫ్ నాయకులు నెల్లూరప్ప, శాంతికుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి సన్మానం



విజయ కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

**బేతంచెర్ల:** విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు గొప్పవని పారిశ్రామికవేత్తలు గుండా గోపాలు, మధు మోహన్‌రెడ్డి అన్నారు. శేషారెడ్డి ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం చిదంబర శాస్త్రి జ్ఞాపకార్థం చిదంబర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు నాగేళ్ల విజయకుమార్, శృతిక దంపతులను సోమవారం సన్మానించారు.

### మెరుగైన వైద్య సేవలు అందించాలి

**సంజామల:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారద సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని పేరుసోముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని, వాక్సినేషన్, టీబీ పరీక్షల లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు వినయ్, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

### గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

**కోవెలకుంట్ల/బనగానపల్లె రూరల్:** ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉదయం తన సతీమణి ఇందిరమ్మతో కలిసి యాగంటి ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

### నైపుణ్య గణనపై శిక్షణ

**బేతంచెర్ల:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే నైపుణ్య గణనను బాధ్యతగా నిర్వర్తించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. నైపుణ్య గణనలో ప్రతి ఇంటికి వెళ్లి 15 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న వారి వ్యక్తిగత సమాచారం, విద్యార్హత, నైపుణ్యం తదితర అంశాలపై వివరాలు సేకరించాలని తెలిపారు.

–**సంజామల:** మండలంలో 15 నుంచి 55 ఏళ్ల వయస్కుల వివరాలు సేకరించాలని ఎంపీడీఓ సాల్మాన్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి యువకులు, నిరుద్యోగుల సమాచారం సేకరించాలని తెలిపారు.

### ఆర్థిక సాయం

**డోన్ రూరల్:** మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన బోయ మహేంద్ర అనే బాలుడు కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కర్నూలులోని ఓ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడు. విషయం తెలుసుకున్న జీవన్ వెల్ఫేర్ సొసైటీ సోమవారం బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం చేసింది. సొసైటీ సభ్యులు శివ, విష్ణు రాజేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

### వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ధర్నా

**డోన్ రూరల్:** రైతులకు అన్యాయం చేస్తున్న కూరగాయ మార్కెట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామం వద్ద సోమవారం సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఇంతియాజ్‌కి వినతి పత్రం అందజేశారు.

# ఆపద్బాంధవులకు ఆపద

- వేతనాల కోసం ఎదురు చూపులు
- 108,104 సిబ్బందిపై జాలి చూపని కూటమి ప్రభుత్వం
- ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని పరిస్థితి



కొలిమిగుండ్లలోని 108 వాహనం

**కొలిమిగుండ్ల:** పగలు, రాత్రి తేడా లేకుండా మారుమూల గ్రామాల్లో సైతం ప్రజల ప్రాణాలు కాపాడేందుకు విధులు నిర్వహిస్తున్న 108,104 ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం కర్కషంగా వ్యవహరిస్తోంది. నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దసరా, దీపావళి పండుగలు సైతం కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోలేక పోయారు. 108, 104 సేవలను అరబిందో సంస్థ నిర్వహిస్తోంది. మూడు నెలలకు ఒకసారి నిధులు ఇచ్చేలా కూటమి ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సకాలంలో ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో 108 వాహనాలు 30 ఉండగా 142 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 104 వాహనాలు 30 కాగా 70 మంది మేర పనిచేస్తున్నారు. 108లో ఇద్దరు పైలెట్‌లు, ఇద్దరు ఈఎంటీలు, ఒకరు రిజర్వులో ఉంటారు. 104లో డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పని చేస్తుంటారు. జూలై నుంచి ఒక్క పైసా చెల్లించలేదు. చాలా మంది ఉద్యోగులకు వేతనాలు లేకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి. అత్యవసర సమయంలో గోల్డెన్ అవర్‌కు ప్రాధాన్యం ఉంది. ప్రమాదం జరిగిన వ్యక్తికి గంట వ్యవధిలో ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తే ప్రాణాప్రాయం నుంచి బయట పడే అవకాశం ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే దిగంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108 వ్యవస్థను తీసుకొచ్చారు. ఆయన తర్వాత సీఎంగా కొనసాగిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అదే బాటలో కొనసాగించారు. కానీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

**పనిభారం అధికం**

108 వాహన సిబ్బందికి పని భారం పెరుగుతోంది. ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు, మహిళల ప్రసవాలు, ఇతర అనారోగ్య సమస్యలకు చెందిన కేసులు వస్తుంటాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించేందుకు సిబ్బంది ఎంతో ఆరాటపడుతుంటారు. 24 గంటల పాటు అప్రమత్తంగా పని చేస్తూ ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకుంటుంటారు. అయినా ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో మనస్థాపానికి లోనవుతున్నారు. ప్రభుత్వం నుంచి అరబిందో సంస్థకు నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. వాటితోనే వాహనాల నిర్వహణతో పాటు సిబ్బంది జీతాలు ఆ సంస్థ చెల్లిస్తుంది. ఇందుకు గాను ప్రభుత్వం పాత 108 వాహనానికి రూ.2.20 లక్షలు, కొత్త వాహనానికి రూ.1.90 లక్షలు చెల్లిస్తుంది.

**గ్రామాలకు 104 వరం**

గ్రామీణ ప్రజలకు 104 వాహన సేవలు వరంగా మారాయి. 104లో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈసీజీతో పాటు తొమ్మిది రకాల పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు ఉచితంగా అందజేస్తారు. ప్రజలకు ఇన్ని రకాల సేవలు అందిస్తున్నా సకాలంలో జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు నెలలుగా అందని వేతనాలు**

ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో వేతనాలు ఇవ్వలేకపోతున్నామని అరిబిందో సంస్థ చెబుతోంది. దీంతో నాలుగు నెలలుగా వేతనాలు రాక ఉద్యోగులకు ఆకలి కేకలు తప్పడం లేదు. సేవలు బంద్ చేస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారనే ఉద్దేశంతో అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా వారి బాధలను భరిస్తునే నవ్వుతూ విధులు నిర్వహిస్తున్నారు. తమపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యహరిస్తోందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. 108 పైలెట్‌లు, ఈఎంటీలకు రూ.20 నుంచి రూ.30వేలు వేతనం అందుతోంది. 104 డ్రైవర్లకు సీనియారిటీని బట్టి రూ.14వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.15వేలు వేతనం ఇస్తున్నారు.

**ఎదురుచూస్తున్నాం**



నాలుగు నెలలుగా వేతనాలు అందలేదు. ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం. 15 ఏళ్ల నుంచి పైలెట్‌గా పని చేస్తున్నాను. కాల్ వచ్చిన తక్షణమే సంఘటనా స్థలానికి వెళుతుంటాం. చాలా మంది నెల జీతంపై ఆధారపడిన వాళ్లు ఉన్నారు. తక్షణమే వేతనాలు మంజూరు చేయాలి.

–పవన్‌గోపాల్, పైలెట్, కొలిమిగుండ్ల

**ఉద్యోగ భద్రత కల్పించాలి**



108లో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సకాలంలో సేవలు అందిస్తున్న మాకు అన్యాయం చేయడం బాధాకరం. ఉద్యోగ భద్రత ఉంటే సకాలంలో వేతనాలు అందుతాయి. 14 ఏళ్లుగా పని చేస్తున్నాను. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఎంతో ఆరాటపడుతుంటాం.

–జనార్దనరెడ్డి, ఈఎంటీ, అవుకు

**నిధులిస్తేనే జీతాలిస్తారంట**



అరబిందో సంస్థకు ప్రభుత్వం నుంచి నిధులిస్తేనే జీతాలు ఇస్తారంట. నాలుగు నెలలుగా జీతాలు అందక ముఖ్యమైన పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా చేసుకోలేని దుస్థితిలో ఉద్యోగులు ఉన్నారు. 108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి. అప్పుడే మాకు అన్ని రకాల బెనిఫిట్స్ అందుతాయి.

–శేషయ్య, జిల్లా అధ్యక్షుడు, 108 ఉద్యోగుల సంఘం

# రహదారిపై 'పచ్చ' కక్ష



వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన డ్రైయినేజీ



డ్రైయినేజీ పక్కనే కాల్వ పేరుతో తవ్వకాలు జరిపి రోడ్డుపై పోసిన మట్టి

- డ్రైయినేజీ ఉన్నా కాల్వపేరుతో పక్కనే తవ్వకాలు
- మట్టిని తవ్వి రోడ్డుపై వేసి రాకపోకలకు అడ్డంకి
- పొలాలకు వెళ్లేందుకు రైతుల అవస్థలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులంటూ కక్షసాధింపు

**కోవెలకుంట్ల:** మండలంలోని కంపమల్ల బీసీ కాలనీ ప్రజలపై గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధిస్తున్నారు. కాలనీలో 75 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులున్నారనే దురుద్దేశంతో కాలనీ ప్రజలకు రహదారి కష్టాలు తెచ్చిపెట్టారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1.30 లక్షల గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి 150 మీటర్ల మేర కాలనీలో డ్రైయినేజీ కాలువ ఏర్పాటు చేశారు. ఈ రహదారి వెంటే గ్రామానికి చెందిన రైతులు, కాలనీ ప్రజలు పొలాలు, ఊరకుంట, మెయిన్‌రోడ్డుకు వెళుతున్నారు. డ్రైయినేజీ ఉన్నా ఇటీవల టీడీపీ నాయకులు ఆ డ్రైయిన్ పక్కనే ప్రొక్లెయిన్‌తో కాల్వ పేరుతో తవ్వకాలు చేపట్టారు. తవ్విన మట్టిని రోడ్డుపైనే కుప్పలుగా పోయడంతో రహదారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. పొలాలకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. రబీ సీజన్ ప్రారంభం కావడంతో శనగ, జొన్న, మొక్కజొన్న, మినుము, తదితర పంటల సాగుకు రైతులు రసాయన ఎరువులు, విత్తనాలు తరలించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. దారి లేకపోవడంతో వాటిని తరలించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. అలాగే మారెమ్మ గుడి, మెయిన్ రోడ్డుకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి వెళ్లే రోడ్డులో డ్రైయినేజీ ఉన్నప్పటికీ కాలనీపై రాజకీయ కక్షపెంచుకున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రహదారి కష్టాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆలయ భూమిలో మట్టి తవ్వకాలు

- పవర్ గ్రిడ్‌కు తరలిస్తున్న మట్టి
- అభ్యంతరం వ్యక్తం చేసిన గ్రామస్తులు



గోమడుగు చెండ్రాయుడు ఆలయ భూమిలో మట్టి తవ్వకాలు

**కొలిమిగుండ్ల:** తిమ్మనాయినపేటలోని గోమడుగు చెండ్రాయుడు ఆలయానికి చెందిన భూమిలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. నందిపాడు–తిమ్మనాయినపేట గ్రామాల మధ్య కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పవర్‌గ్రిడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రిడ్ కాంపౌండ్ వాల్ సమీపంలోనే 602 సర్వే నెంబర్‌లో చెండ్రాయుడు ఆలయానికి 17.4 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తోంది. గతంలో ఆలయ భూమిలో పంటలు సాగు చేసేవారు. కాలక్రమేణా పంటలు వేయకపోవడంతో అక్కడ చెట్లు పెరిగాయి. పవర్‌గ్రిడ్‌లో పనులు జరుగుతుండడంతో మట్టిని తరలించే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. నాలుగు రోజుల నుంచి ప్రొక్లెయినర్‌లు ఏర్పాటు చేసి మట్టిని తవ్వి టిప్పర్ల సాయంతో గ్రిడ్‌లోకి తరలించుకుపోతున్నారు. ఇప్పటికే ఎకరా విస్తీర్ణంలో తవ్వకాలు చేసినట్లు తెలుస్తోంది. ఆలయ భూమిలో మట్టిని తవ్వి తరలించడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయ భూమిలో ఎలా మట్టి తవ్వకాలు చేస్తారని ప్రశ్నించినా యథావిధిగా తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం. సమీపంలో ప్రభుత్వ బంజరు భూమి ఉన్నా ఆలయ భూమిలో తవ్వకాలు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి తవ్వకాలపై ప్రజలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిషయంపై తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని వివరణ కోరగా వీఆర్వోను పంపి వివరాలు సేకరిస్తామన్నారు.

## బీమా ప్రీమియం చెల్లించండి

**బేతంచెర్ల:** మండలంలో రబీ పంటలు సాగు చేసిన రైతులు డిసెంబర్ 15తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. బ్యాంకుల్లో రుణం తీసుకున్న వారు అక్కడే చెల్లించాలని, రుణం తీసుకోని రైతులు మీసేవా కేంద్రాల్లో చెల్లించాలని చెప్పారు. శనగలు హెక్టారుకు రూ.210, వరి రూ. 310, జొన్నలు రూ.148, మినుములు రూ.118, వేరుశనగ రూ.160, ఉల్లి రూ. 225 చొప్పున ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు.

# నాటడమెందుకు.. నరికివేయడం ఎందుకు..?





నాడు: మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్. నేడు: విచక్షణారహితంగా చెట్లను నరికివేసిన దృశ్యం

**డోన్:** పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు, పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయితే డోన్ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాతల సహకారంతో మూడేళ్ల నుంచి సంరక్షించిన అనేక చెట్లను కొంతమంది ఆరోగ్యానికి చేటు అనే నెపంతో విచక్షణారహితంగా నరికివేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు అడ్డంకిగా మారిందని కొట్టి వేస్తున్నారు. నిరాటంకంగా కొనసాగుతున్న చెట్ల నరికివేత కార్యక్రమాన్ని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృక్షో రక్షిత రక్షితః అని ఎక్కడ చూసినా చెట్లను మనం రక్షిస్తే.. మనల్ని చెట్లు రక్షిస్తాయని వల్లెవేసే నాయకులు, అధికారులు ఇకముందు మొక్కలు పెంచేందుకు దాతలను ఏ మొఖం పెట్టుకుని అడుగుతారని స్థానికులు నిలదీస్తున్నారు. పచ్చదనంతో అలరారే పలు రహదారులు నేడు చెట్లు నరికివేతతో బోసిపోయాయి. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



నేలబెలుంలో పూజలు చేస్తున్న భక్తులు



కొలిమిగుండ్లలో పూజలు నిర్వహిస్తున్న పూజారి



అవుకు: బలరామేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శివుని చిత్రం

# భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు



కోవెలకుంట్ల: మారెమ్మ ఆలయంలో ఓంకారం ఆకారంలో వెలిగించిన దీపాలు



ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జునస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**కోవెలకుంట్ల:** కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీ సెంటర్‌లో వెలసిన శివాలయం, నాగలింగేశ్వర స్వామి, పాటిమీద శివాలయం, మారెమ్మ ఆలయం, ఏడుకొప్పెర్లబావి సమీపంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని భీమునిపాడు పద్మనాభస్వామి ఆశ్రమంలో పంచబ్రహ్మలింగేశ్వరస్వామి, గుళ్లదుర్తి, కలుగొట్ల, బిజనవేముల, రేవనూరు, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లో కార్తీక మాస పూజలు ఘనంగా జరిగాయి.

**కొలిమిగుండ్ల:** కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో పాటు అయ్యప్ప, శివదీక్ష స్వీకరించిన స్వాములు పెద్ద ఎత్తున పూజలు చేశారు. బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి చుట్టు పక్కల గ్రామాలతో పాటు అనంతపురం జిల్లా నుంచి భక్తులు తరలివచ్చి అభిషేకాలు చేశారు. అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, బెలుం, పెట్నికోట, యర్రగుడి, కోటపాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

**ఆకట్టుకున్న శివుని చిత్రం**

**అవుకు:** మండలంలోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో దీపాలు వెలిగించారు. అగ్రహారం వీధిలోని బలరామేశ్వరస్వామి ఆలయంలో పరమశివుని చిత్రం గీసి చుట్టూ దీపాలను వెలిగించారు.

**భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు**

**ప్యాపిలి:** స్థానిక కాశీ, రామేశ్వరాలయంలో కార్తీక సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసంలో తండుల (బియ్యం) పూజ నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత అని పూజారి నరేశ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాశీ విశ్వేశ్వరున్ని, రామేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జంట శివలింగాలు ఉన్న ఏకైక ఆలయంగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది.



యాగంటిలో నందీశ్వరుడికి పూజలు

## యాగంటిలో భక్తుల సందడి



యాగంటిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

**బనగానపల్లె రూరల్:** కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని యాగంటి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. ఉమామహేశ్వరస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా ఆలయ కోనేరులో స్నానాలు ఆచరించి ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరుడు, స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు**

**బేతంచెర్ల:** మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. హెచ్.కొట్టాల గ్రామ సమీపంలోని ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి, యంబాయిలోని రామలింగేశ్వరుడు, బైనపల్లె, ముసలాయిచెర్వు, రహిమానుపురం గ్రామాల్లో వెలసిన కాశీవిశాలక్ష్మి, విశ్వేరస్వామి, సిమెంట్‌నగర్‌లోని జీవబుగ్గ లింగేశ్వరస్వామి, పూదోట మఠంలోని భేతేశ్వర శివలింగం, దుర్గాపేటలోని సిద్దేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్నారు.

## అమర్త్యసేన్ సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్

**బనగానపల్లె రూరల్:** ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ దేశానికి అందించిన సహకారం అపూర్వమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబునాథ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమర్త్యసేన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. బాబునాథ్ మాట్లాడుతూ.. ఆర్థిక రంగంలో అమర్త్యసేన్ సేవలకు నోబెల్ బహుమతితో పాటు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న అందుకున్నట్లు వివరించారు. విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్థశాస్త్రం అధ్యాపకుడు రామన్న, కోఆర్డినేటర్ డాక్టర్ బడేసా హెబ్, రామకృష్ణ, కౌసల్యదేవి, మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

## వైజ్ఞానిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



ప్రాచీనకాలం నాటి గ్రంథాల ప్రాముఖ్యతను వివరిస్తున్న రీసెర్చ్ అసిస్టెంట్లు

**కోవెలకుంట్ల:** విద్యార్థులు వైజ్ఞానిక పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రపంచంలోని అనేక విషయాలను తెలుసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వైజ్ఞానిక యాత్రలో భాగంగా సోమవారం కడప టౌన్‌లోని సీపీబ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ పరిశోధన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, కైఫియతులను పరిశీలించారు. గ్రంథాలయంలో పనిచేస్తున్న రీసెర్చ్ అసిస్టెంట్లు హరిభూషణరావు, గోపాలకృష్ణ శాస్త్రి, పలు గ్రంథాలకు సంబంధించి విద్యార్థులకు వివరించారు. ప్రాచీక కాలంలో ఉపయోగించిన ఘంటాలు, నాణేలను పరిశీలించారు. అనంతరం పుష్పగిరి మఠం, ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రాచీనకాలం నాటి శిలాశాసనాలను అధ్యయనం చేశారు. విద్యార్థుల వెంట వృక్షశాస్త్ర అధ్యాపకురాలు లక్ష్మీదేవి, సిబ్బంది ఉన్నారు.